# గృహ పరిపాలన

నిత్యజీవితంలో ఇల్లాలు చూచే విషయాలు ఒకరు. ఇంటాయన చూచే విషయాలు మరొకరకమూ అన్నసంగతి అందరికీ తెలిసినదే.

ఈ గృహరాజ్య పరిపాలనకు సంబంధించిన విషయాలలో కొన్ని యిల్లాలు పరంగానూ మరికొన్ని ఇంటాయన పరంగానూ వుంటూ వుంటవి. అదొక విధమైన ద్వంద్వ పరిపాలన.

పనివాళ్ళను నియమించటమూ, వాళ్ళచేత పనులు చేయించుకోవడమూ, బియ్యం, ఉప్పు పప్పు మొదలైన వస్తువులను తెప్పించుకొని వాడుకొనడమూ, దగ్గరలోనూ చిలకలపూడి, చింతగుంటపాలెం, శివగంగ ఇత్యాది పుణ్య క్షేత్రాలకు వెళ్ళిరావటమూ, పిల్లలను సినిమాకు పంపటమూ, వాళ్ళకు పండుగలకు బట్టలు కుట్టించటము అల్లుళ్ళను పండుగలకు పిలిపించటమూ, వారిని ఉచితరీతిన సత్కరించటమూ, కూతుళ్ళను పురుళ్ళకూ, పుణ్యాలకు తీసికొనిరావటమూ, మనవలకూ, మనుమరాండ్రకూ బట్ట కుట్టించి ముద్దు ముచ్చటలు తీర్చటమూ మొదలైన వివరములు పూర్తిగా ఆవిడ అధీనమై వుంటూ వున్నవి. ట్రాన్సుఫర్డు సబ్‌జక్టు. ఈ సబ్‌జక్టుకు సంబంధించిన పాలన అంతా ఆమె జరుపుతూ వుంటుంది.

ఇల్లాలి ప్రభుత్వం ఒకవిధంగా నిరంకుశమే అని చెప్పాలి. కాని ప్రజాహితమైనది. నోరులేని ప్రజలకు ఏది కావాలె అది సమకూరుస్తూ వుంటుంది. వాళ్ళ విశ్వాసమునూ, ప్రేమనూ ఆమె చూరగొంటుంది. అది ఆమె నిత్యజీవితము. పైన జెప్పిన విషయాలకు సంబంధించిన పరిపాలనను సమర్థతతో నిర్వహించటమే ఆమె లక్ష్యము.

ఇంటావిడ విషయాలు యివా, యిక అవిపోను, మిగిలిన విషయాలు యింటాయనవి. అంటే అవి రిజర్వుడు సబ్‌జక్టు అన్నమాట. పిల్లలకు పాఠాలు చెప్పటమూ, పసిపిల్లలు ఏడిస్తే భుజాన వేయటమూ, ఆవిడవైపు బంధువులకు తరుచూ క్షేమసమాచారం తెలుపుతూ ఉత్తరాలు వ్రాస్తూ వుండటమూ, రేషన్ బియ్యం తేవడమూ, పంచదార తేవడమూ మొదలైనవి యింటాయన ఆధీనంలో వుంటూ ఉంటవి.

అసలు నిజం మాటకొస్తే రిజర్వుడు సబ్‌జక్టు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఆమెగారి ఆధీనమైయున్న సబ్‌జక్టు పోను మిగిలినవన్నీ గృహయజమానికి మిగులుతయ్యి. రాజ్యాంగతత్వ శాస్త్రంలో వీనికి రిసిడ్యుయరీ పవర్స్ అని పేరు.

ఇల్లాంటి గృహపరిపాలనా విధానము, కొద్ది మార్పులతో, అన్ని ఇళ్లల్లోనూ వుంటూ వున్నదని మా విశ్వాసం.

ఇంటావిడ ఆధీనంలో వున్న యీ విషయాలకు కావలసిన డబ్బు యజమాని తన ఆదాయంలోనుంచి విడిగా తీసి యియ్యవలెను. ఆమె కోరిన డబ్బు యియ్యవలసిందేగాని కొన్ని ఖర్చులు తగ్గించుకోవలసిందని ఆమెను కోరటానికి యజమానికి ఎల్లాంటి అధికారమూ లేదు.

ఆదాయ వ్యయ పట్టికను తయారు చేయు పని ఇల్లాలుదేగాని ఇంటాయనది కాదు. మనీబిల్సు అన్నీ వంట యింట్లోనే ప్యాసయి యజమానికి వస్తయి. యజమాని వానిని ఆమోదించి తీరాలె. అంతగా కష్టంగా వుంటే, కొద్దిగా గొణకటానికి, యితోధికంగా సణకటానికి అధికారాలు వున్నాయి. కాని అవి ప్రత్యేకమైనట్టిన్నీ, విశిష్టమైనట్టిన్నీ అధికారాలు కావటంచేత, దైనందిన పరిపాలనలో వానిని ఉపయోగించకూడదు. క్లిష్టపరిస్థితులలో అసామాన్య సంఘటనలూ, సన్నివేశాలూ వచ్చినపుడు మాత్రమే యీ హక్కులను వినియోగించుకొనవలెను.

ఇల్లాంటి రాజ్యాంగ విధానంలో యజమాని యిల్లాలికి లోబడినవాడు అయినవాడనిగాని, అధికారాలు లేనివాడు అయినాడనిగాని అనుకోటం, లేక పైకి బహిరంగముగా అనటమూ రాజద్రోహంగా పరిగణించబడుతుంది.

యజమానికి కావలసినంత స్వేచ్ఛ వుంది. బడ్జటులో తనకై కేటాయింపబడిన డబ్బులోనుంచి బీమా సొమ్ము కట్టి మిగిలినది సిగిరెట్లు కొనుక్కొంటానికి, ఎప్పుడైనా కాస్త కాఫీ హెూటలుకు వెళ్ళటానికి యధేచ్ఛగా వాడుకోవచ్చు. ఇవి అతని జన్మహక్కులు, లేక ప్రాథమిక హక్కులు.

ఈ గృహయజమానికి హక్కులు ఎల్లాగున్నయ్యో. బాధ్యతలూ అల్లాగే వున్నయి. అవి ముఖ్యంగా రెండు. ఈ గృహరాజ్యానికి రాబడుతూన్న ఆదాయమును అనేక

విధాలుగా వృద్ధి చేయటమూ, అవసర సమయంలో అప్పులు పుట్టించి తెచ్చి యిస్తూ వుండటమూనూ.

ఇక్కడ యింకొక విషయము కూడా చెప్పవలసి వుంది. ఇంటిని, యింటి పరిసరాలను కాపాడుతూ వుండే బాధ్యత యజమానిదే కాబట్టి, యజమాని నిర్వహించేది కేంద్ర ప్రభుత్వమూ, యిల్లాలు నిర్వహించేది స్థానిక ప్రభుత్వమూ అని కూడా నిర్వచనం చేయవచ్చు.

ఇంతకూ చెప్పవచ్చింది ఏమిటీ అంటే, యీ స్థానిక ప్రభుత్వ నిర్వహణలో యిల్లాలు నిమగ్నురాలై వుంటుందీ అని! ఆమె నిత్యజీవితం ఎల్లాంటిదీ అన్నప్పుడు, ఆమె యిల్లు ఊడ్చునూ, వంటవండునూ అని యిల్లాగ అతిస్వల్ప విషయాలను వర్ణించటం వుచితంకాదనీ, ఆమె జీవితం ఏ మార్గాన నడుస్తున్నదో, ఆ మార్గాన్ని మాత్రం చూపితే చాలుననీ మా అభిప్రాయం.

ఈ రాజ్యాంగ విధానంలో కేంద్రప్రభుత్వం కాస్త బలహీనంగానూ, స్థానిక ప్రభుత్వం బలమైనదిగానూ వుంటూ వున్న మాట గమనించతగ్గది.

స్థానిక ప్రభుత్వ విషయాలలో కేంద్రం అనవసర జోక్యం కలుగజేసుకొన్నప్పుడు, స్థానిక ప్రభుత్వంవారు కేంద్రంపై దెబ్బతీయటానికి చాలా అవకాశాలున్నమాట నిజమే. ఒక్కొక్కప్పుడు అల్లాంటి దాడి జరిగి, ఉభయ కేంద్రాల మధ్య రాయబారాలు జరగడమూ, చివరకు సమరసభావంతో సంధి కుదిరి, దాని ననుసరించి కేంద్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వాధికారులకు, నూతన వస్త్రాదులనూ, విలువగల బంగారపు నగలనూ యిచ్చి, వారిని తృప్తిపరచి వారి అనుగ్రహము సంపాదించవలసిన అగత్యం కూడా కలుగుతుంది.

ఇల్లా ప్రభుత్వ శాఖలు విడివిడిగా వుంటూ వున్నప్పటికినీ, కేంద్ర, స్థానిక ప్రభుత్వాలమధ్య తగవు రావటానికి అనేకమైన అవకాశాలు వుంటూ వున్నవి. ముఖ్యంగా వుభయ కేంద్రములవారి ఆధీనమైయున్న అతిథి సత్కార విషయములో యిటువంటి తగవులు వస్తూ వుంటవి.

అతిథులు రెండు రకాలుగా వుంటూ వున్నారు. ఆమె వైపు వారు; ఆయన వైపు వారు.

ఇందులో యిల్లాలు తరపు బంధువులు వచ్చినప్పుడు యింటాయన బహు శ్రద్ధాభక్తులతో ప్రవర్తించవలసి వుంటుంది. వారి యెడల యెట్టి అపచారమున్నూ జరగకూడదు.

ఇల్లాలు అంటుంది 'మా అమ్మ వస్తున్నదండీ' అని. అప్పుడు యింటాయన వుదాసీనభావంతో మౌనంగా వుండటమూ లేక 'సరే' అని వూరుకొనటమూ కూడా ప్రభుత్వ విద్రోహక చర్యగానే పరిగణించబడుతుంది. యజమానితో యిల్లాలు. సరిగ్గా మాట్లాడకపోవడమూ ఏదైనా ప్రశ్న అడిగినపుడు, ఊఁ, ఆఁ, అను ఏకాక్షర శబ్దాలతో జవాబు చెప్పడమూ – ముక్కు మూతి విరుపులను ప్రదర్శించటమూ జరుగుతుంది. ఇది అల్ప విషయమైనప్పటికీ యింటాయనకు అధికమైనటువంటి మనఃక్లేశానికి కారణము అవుతుంది అన్న విషయము నిర్వివాదాంశం.

కాబట్టి ఇట్టి దుస్థితి రాకుండా వుండటానికి, ఇంటాయన ఆమెగారి తల్లి వస్తూ వున్నదని వినటంతోనే వికసించిన వదనముతో, అమితమైన ఆనందాన్ని ప్రకటిస్తూ, అంతకంటే సంతోషాన్ని యిచ్చే విషయము మరొకటి లేదని చెప్పవలెను.

అయితే ఒకటి. ఆ వచ్చే మనిషికి సరిగ్గా బయలుదేరే రోజున చలిజ్వరం రావాలనిగాని ఆమె ఎక్కిన ఒంటెద్దు బండి దారిలో బోల్తాపడి ఆమె మోకాళ్ళకు తగుమాత్రం దెబ్బతగలాలని కాని, లేక ఆమె రావలసిన మార్గంలో ఒక రైలు వంతెన విరిగిపోయిన కారణాన రైళ్ళు నడవక ఆమె ప్రయాణం ఆగిపోవలెననిగాని మనస్సులో కోరుకొంటే, తప్పులేదు. కాని 'ఉత్తరం వ్రాయండి, రేపు శనివారమే బయలుదేరి రమ్మని' అన్నప్పుడు, సంతోషంతో అంగీకరించి శనివారంరోజున ఏ బండికి మెయిలు ఎదురుగా వస్తూ వుంటుందో చూచుకొని ఆ బండిలో ఎక్కిరమ్మని వ్రాయడం చాలా మంచిది. దాని తరువాత మన అదృష్టం! లేక ఇప్పుడెందుకులే అన్నాడా; అది ప్రభుత్వ విద్రోహక చర్యగా పరిగణించబడుతుంది.

ఆ వచ్చిన ఆవిడ అమ్మగానీ అక్కగానీ, యెన్నాళ్ళు వున్నా యింటాయన విసుగుదల పొందకూడదు. ఈ కరువు రోజులలో బియ్యం వుండవు. ఎంత ఖరీదైనా పెట్టి చీకటి బజారులో కొనుక్కు రావాలిసిందే. ఇల్లాలు అవతల వాళ్ళతో అంటుందీ 'మా కేమీ యిబ్బంది లేదక్కా బియ్యానికి! నీవేమైనా అనుకొంటున్నావేమో! మీ

మరిదికి ఆ అధికారులంతా స్నేహితులే! కావలసినన్ని బియ్యం సప్లయి అవుతాయి.' అంటూ వుంటే గప్‌చిప్‌గా వూరుకోవలసిందే! నల్లబజారులో విపరీతమైన ధరలకు బియ్యం తేవటం కష్టమై, మనఃక్లేశం కలిగితే పడకగదిలోకి పోయి, పరుపు మీద పడుకొని, మెత్తని దిండులో తలదూర్చి తగుమాత్రంగా గుట్టుచక్కంగా కన్నీళ్ళు కార్చటానికి మాత్రం గృహ యజమానికి హక్కువుంది.

ఆ గృహిణి అక్కగారు పదిరోజులు వుండి, వెడతాను అన్నప్పుడు యింకా రెండురోజులుండు అక్కా ఏం తొందర! వచ్చినప్పటినుంచి 'వెడతాను వెడతాను' అంటావు అని యిల్లాలు అంటూ వున్నప్పుడు, యజమాని అధికమైన నిగ్రహశక్తితో, నవ్వుతూ, 'ఉండు వదినా, ఏం వెడతావు! మనము అసలు బియ్యంలేక నానా అవస్థ పడుతుంటే,' అని ఆమెతో రహస్యంగా అన్నా, అది చాలా ప్రమాదకరమైన అవస్థలకు దారితీస్తుందనీ గృహరాజ్య పరిపాలనా విధానానికి భంగకరమనీ గ్రహించవలసి వుంది.

ఇక యింటాయన స్నేహితుడుగాని, బంధువుగాని అతిథిగా వచ్చినపుడు కేంద్ర ప్రభుత్వంవారు స్థానిక ప్రభుత్వాధికారులకు యీ సంగతి ముందుగా తెలియపరచవలసిన అగత్యం వుందని గమనించవలెను.

ఆ వచ్చిన పెద్దమనిషి ఎవరు, పేరు, యింటిపేరు, ఎట్లా బంధువు? ఎందుకొచ్చాడు, ఎన్నాళ్లుంటాడు అని ఆమె అధికారరీత్యా వేసిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం వారు సావధానంగా, ఓపికతో సమాధానం కూడా యివ్యవలసి వుంటుంది.

ఆమెగారి వైపుగాక యిటు వైపు బంధువులు వచ్చినప్పుడు, ఆ క్షణంలో యింట్లో వున్న బియ్యం మాయం అవటమేకాక యెక్కడా అప్పు కూడా పుట్టదూ అన్నది గృహ యజమాని జ్ఞాపకం వుంచుకోతగిన విషయము.

అల్లాంటప్పుడు అతిథి సత్కారానికి కేంద్ర ప్రభుత్వం వారు కొంత సొమ్ము స్థానిక ప్రభుత్వానికి యిచ్చి పనులు జరుపుకొనటం ప్రపంచంలో చాలా యిళ్ళల్లో ఆచారము అయి వున్నది. అల్లా యిచ్చిన తరువాత అతిథి సత్కారం సంసార పక్షంగా జరిగిపోతుంది. జరిగిపోయినా ఆవిడ అనవలసిన నాలుగూ అనకమానదు – అని జ్ఞాపకం వుంచుకొని దానికై సిద్ధపడి వుండటం చాలా మంచిది. ఇంటావిడ 'ఎబ్బే!

ఎన్నిసార్లు చెపితే ఏం లాభం! మనిషికి తెలియకపోయె! ఎవరినో ఒకరిని తీసికొచ్చి నెత్తిమీద కెక్కిస్తూ వుంటారు' అని అనటం సహజము. 'నేను మటుకు ఆయనను రమ్మని పిలిచానా! తీరా వచ్చిన వాళ్ళను యెట్లా వద్దనేది?' అంటాడు యజమాని! 'ఉండమని అనక ఏదో రాజకీయ విషయాలు మాట్లాడుతూ యెప్పుడో మధ్య, బియ్యం యిబ్బందిని గూర్చి చెప్పకపోయినారా, ఆ వచ్చిన ఆయన వచ్చినట్లే వెళ్ళిపోయేవాడు' అంటుంది యిల్లాలు. దానిమీద 'అల్లా అనటం మర్యాద కాదేమోనని వూరుకొన్నాను' అని ఇంటాయన అంటాడు. 'ఈ మర్యాదలన్నీ పెటుకుకూర్చుంటే అయినట్లే' అని యిల్లాలు నసుగుతుంది. ఇది మామూలు పరిస్థితులలో జరిగే కార్యక్రమము. అంతటితో ఆ వ్యవహారం ఆగిపోయి ఏదోవిధంగా అతిథి సత్కారం తృప్తికరంగానే జరుగుతుంది. ఏ యిల్లాలు వచ్చిన అతిథిని అవమానపరచీ, అప్రతిష్ఠ తీసికొనిరాదు.

కాని ఒక్కొక్కప్పుడు ఈ వ్యవహారం యింకా కాదు పైకే పోతుంది. ప్రతిరోజూ రాత్రిళ్ళు సమావేశమయ్యే సుప్రీంకోర్టు దాకా వెళ్ళటమూ, ఈ కరువు కాలంలో అతిథులను తీసుకొని రావటమనేది రాజ్యానికి మోయరాదు బరువు అవటమే కాక, ప్రశాంతమైన యిల్లాలు జీవితంలో కల్లోల కారకమైనట్టి, అవాంఛనీయమైనట్టి కృత్యంగా నిర్ణయింపబడటమూ, అటు తరువాత, కర్ణమర్దన అనే శిక్షకు యజమాని పాత్రుడు కావడమూకూడా జరుగుతూ వుంటుంది.

ఇంటాయన ఇంతటి స్వల్పశిక్షతో బైటపడితే చాలా సంతోషించవలసిన విషయమనిన్నీ, ఆ ప్రాచ్య దేశాలలో ఇల్లాలు, ఇంటాయనను, యింతకంటే ఎక్కువైన శిక్షలకు పాల్పడచేస్తున్నది అనీ, అది ఆ దేశాలలో సమ్మతము అయిన చర్య అనీ మనము గ్రహించగలిగిన మనకు చాలా తృప్తి కలుగుతుంది.